క్లుప్తంగా

రూ.5 లక్షల వైఎస్సార్ బీమా అందజేత



నూకరత్నంకు చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు, చిత్రంలో కౌన్సిలర్ పాప

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో చర్చి గోడ కూలి చనిపోయిన 12వ వార్డుకు చెందిన పిట్టా అర్జున్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో రూ.ఐదు లక్షలు మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ వారా పాప ఆధ్వర్యంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొబాబు మృతుని భార్య పిట్టా నూకరత్నంకు ఆ చెక్కును అందజేశారు. నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్ పాల్గొన్నారు. నూకరత్నం దవులూరి దొరబాబుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

విశాఖపట్నం వెళ్లి పింఛను అందజేత



వైజాగ్ ఆసుపత్రిలో వెంకటరమణకు పింఛను అందిస్తున్న వలంటీర్ వీరబాబు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొప్పిశెట్టి వెంకటరమణ అనారోగ్యంతో వైజాగ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ గీసాల వీరబాబు తన సొంత ఖర్చులతో వైజాగ్ ఆసుపత్రికి వెళ్లి వెంకటరమణకు పింఛను అందజేశాడు. వలంటీర్ వీరబాబును పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం



ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ నవజీవనరావు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో ప్రపంచ శాంతికై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం ఆధ్వర్యంలో శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన దైవజనులు నవజీవనరావు దైవ ప్రసంగాన్ని అందించారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వంటి మహమ్మారి తగ్గుముఖం పట్టిందంటే ప్రజల్లో ఉన్న ఆధ్యాత్మికతత్వం వల్లే అన్నారు. స్థానిక సంఘాల విశ్వాసులు ఆలపించిన క్రైస్తవ విప్లవగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. దైవజనులు కె.అభిషేక్, విజయ్‌కుమార్, దైవ సేవలకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక రవీంద్రపురంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో పెళ్లి విందును తలపించేలా అన్నదానం ఏర్పాటు చేశారు. ఉప్పాడ, అమీనాబాదు, కొత్తపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

మిస్టరీగానే బాలుడి మృతి కేసు

పెద్దాపురం: స్థానిక లూథరన్ హైస్కూల్ ఎదురుగా బాలాజీ అపార్ట్‌మెంట్‌లో పదేళ్ల బాలుడు చార్లెస్‌రే అనుమానాస్పద మృతి మిస్టరీగానే కొనసాగుతోంది. బాలుడు నివసిస్తున్న అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న కోళ్ల వ్యాపారి, అతని డ్రైవర్ కారు పార్క్ చేస్తుండగా అక్కడే ఉన్న చార్లెస్‌ను గమనించకుండా అతడిపై నుంచి కారును ఎక్కించినట్టు స్థానికుల సమాచారం. అదే రోజు వ్యాపారి, స్థానిక పాత పెద్దాపురం బొమ్మలగుడికి చెందిన డ్రైవర్‌ను కాపాడేందుకు ఓ సోషల్ మీడియా, తన అనుచరగణం కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక ప్రకారం యాక్సిడెంట్ వల్లే బాలుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు వారు తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

కాకినాడ రూరల్: మండలంలోని పగడాలపేటకు చెందిన మోసా శ్రీనివాస్‌ను గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్సై దేవసుధ తెలిపారు. గత నెల 22న శ్రీనివాస్ కరప మండలంలో తన పొలం వద్దకు వెళ్లి వస్తుండగా అతడిని దత్తత తీసుకున్న తల్లికి మనవడి వరసయ్యే గంగిరి సింహాద్రి ఆస్తి తగాదా విషయమై పగడాలపేట వాటర్ ట్యాంకర్ వద్ద దారికాసి గాయపరిచాడు. చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దేశానికి ఆదర్శం ఆరోగ్య సురక్ష

- అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి



పనసపాడులో రోగులకు మందులు పంపిణీ చేసిన దొరబాబు తదితరులు



తాటిపర్తిలో మందులు అందజేస్తున్న దొరబాబు



గోర్సలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పెద్దాపురం: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యమిచ్చి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలం తాటిపర్తి గ్రామంలో శుక్రవారం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తిలతో కలసి ఆయనన సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ గోపు మురళి అధ్యక్షతన జరిగిన సభలో దవులూరి మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఈ కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తే, సీఎం జగన్ దానికి కొనసాగింపుగా ఫ్యామిలీ డాక్టర్ చేపట్టారన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సేవలపై ఆరా తీసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, పార్టీ నాయకులు గోలి రామారావు, ఆటపాకల గోవిందు, లక్కాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

సామర్లకోట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే వైద్యం అందేలా జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో భాగంగా పనసపాడులో జరిగిన కార్యక్రమంలో గురువారం దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సచివాలయాల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే ఆరోగ్య సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే చేశారని, మేరకు ఆయా ఇళ్లలో అనారోగ్యానికి గురైన వారి వివరాలను సేకరించి వారిని శిబిరానికి తరలించి వైద్యం అందేలా చేస్తున్నట్టు తెలిపార. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడం వల్ల ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకొవాలని దొరబాబు పిలుపు నిచ్చారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి అధ్యక్షత వహించగా వైస్ ఎంపీపీ-2 ములసా శ్రీను, వైద్యాధికారులు ప్రశాంత్, శ్రీహిమవతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిశెట్టి నరేష్, మానేపల్లి చిట్టిబాబు, బదిరెడ్డి బుజ్జి, కాళ్ల శ్రీనివాసు, అనుసూరి రమణ, హెల్త్ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది రోగులకు సేవలందించారు. ఈ సందర్భంగా పోషక విలువలతో కూడిన ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

జగనన్న ఆరోగ్యకు విశేష స్పందన

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 380 మందికి కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజుకుమార్, ఇతర సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి. వెంకటనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఈఓపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విశాఖలో ఇస్కఫ్ సమావేశాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కఫ్ జాతీయ సభ్యురాలు నిర్మల

పెద్దాపురం: భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ, రాష్ట్ర సమావేశాలు ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఇస్కఫ్ జాతీయ సమితి సభ్యురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాగితాల నిర్మల తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 82 ఏళ్లుగా సామ్రాజ్యవాద దేశాల యుద్ధోన్మాదానికి, క్షీణ సంస్కృతికి వ్యతిరేకంగా, ప్రజాస్వామిక విలువలు కాపాడుతూ దేశ సమైక్యత కోసం ఇస్కఫ్ కృషి చేస్తోందన్నారు. 7వ తేదీన జాతీయ కార్యవర్గ సమావేశం, రాష్ట్ర సమితి సమావేశం జరుగుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సృంస్కృతీ రక్షణ-జాతీయ సమైక్యతపై సెమినార్ జరుగుతుందన్నారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి ఎనిమిది వరకు వివిధ రాష్ట్రాల కళాకారులతో సాంస్కృతిక ఉత్సవాలు జరుగుతాయని నిర్మల వివరించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నారు కాబట్టే జనం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై పిఠాపురం మున్సిపాలిటీ, మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ప్రతిహామీని తూ.చ. తప్పకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ఆయన అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ, రాజకీయ విభేదాలకు తావు లేకుండా అందరికీ సమానంగా సంక్షేమాన్ని అందిస్తున్నందున ఆయనే ఆంధ్రప్రదేశ్‌కు కావాలని జనం అడుగుతున్నారన్నారు. చేయని పనులను మేమే చేశామని ప్రతిపక్షాలు చెప్పుకోవడం దారుణమన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలని నాయకులకు, కార్యకర్తలు, వలంటీర్లకు సూచించారు. ప్రజల దగ్గరకు వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీ నేతలకే ఉందన్నారు. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలందరినీ కలుసుకుని వారి సమస్యలు పరిష్కరించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగన్ కావాలి అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బొజ్జా దొరబాబు, జవ్వాది నాయుడు, గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జి, వులవల భూషణం, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గోర్సలో న్యూట్రిషన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ అన్నారు. మండలంలోని గోర్సలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝ్జల అవధాని, కోట సుబ్రహ్మణ్యం, దత్తాత్రేయ శర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతేదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయి ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

అర్హత లేకుండా స్కానింగ్ చేయొద్దు

- తనిఖీల్లో గుర్తిస్తే కఠిన చర్యలు
- వైద్యులకు ఆర్డీఓ రామారావు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: డివిజన్ పరిధిలోని అర్హత లేని వైద్యులు స్కానింగ్ సెంటర్లు నడిపితే చర్యలు తప్పవని ఆర్డీఓ జేఎస్ రామారావు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి ఎస్‌డీఏఎల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో రిజిస్టరైన స్కానింగ్ సెంటర్లు 28 ఉన్నాయని, కొత్తగా ఏర్పాటు చేసుకునే వారు జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డివిజన్‌లోని అన్ని స్కానింగ్ సెంటర్లపై ప్రతి మూడు నెలలకోసారి ఈ కమిటీ తనిఖీ నిర్వహిస్తుందన్నారు. నాలుగు నెలలు నిండిన గర్భిణిని తనిఖీ నిమిత్తం కమిటీ స్కానింగ్ సెంటర్‌కు పంపడం జరుగుతుందని, అక్కడ అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. స్కానింగ్ సెంటర్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లింగ నిర్ధారణకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. న్యాయ సలహాదారు కందుల వెంకటాచలం, వైద్యులు ఎన్.సుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన దొడ్డి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటంబానికి శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలను గ్రామ సర్పంచ్ పొలాని దొరబాబు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దాకే రాజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన గర్భిణి శుక్రవారం 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే... ఎ.కొత్తపల్లికి చెందిన వి.దుర్గాదేవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అన్నవరం అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ టి.విద్యాసాగర్, పైలెట్ వి.సత్యనారాయణ వెంటనే అక్కడకు చేరుకుని దుర్గాదేవిని తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వైద్యుల సూచనల మేరకు అంబులెన్స్ సిబ్బంది పురుడు పోశారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని ఈఎంటీ విద్యాసాగర్ తెలిపారు. అనంతరం వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కోడి పందేలాడుతున్న నలుగురి అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఉప్పాడ శివారు పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.800 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పోర్టు పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



పోలీసు స్టేషన్‌లో కేసుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: సాధారణ తనిఖీలలో బాగంగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శుక్రవారం కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. కేసుల నమోదు, పరిష్కార సరళిని ఇన్‌స్పెక్టర్ సుమంత్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన పలువురు ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ సిబ్బంది నుంచి అందుతున్న గౌరవ మర్యాదలు, సేవల ప్రయోజనాలు సంతృప్తికరంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి బాగోగులపై ముచ్చటించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని స్టేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు.

తక్షణం అద్దెలు వసూలు చేయండి

- రూ.26 లక్షల బకాయిపై కలెక్టర్ ఆగ్రహం
- సత్వర చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశం
- అరువు వ్యాపారాలపై విచారణ నివేదిక
- ఆర్ఎంఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం



కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో వ్యాపారాల పేరుతో తిష్ట వేసి అద్దెలు ఎగ్గొడుతున్న వారిపై కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం సీరియస్ అయ్యారు. స్పందనలో అందిన వరస ఫిర్యాదుల మేరకు ఆమె విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో విస్తుపోయే వాస్తవాలు ఆమె దృష్టికి వచ్చాయి. కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక విచారణ బృందం ఆసుపత్రిలో రెండు రోజుల పాటు పర్యటించింది. జీజీహెచ్‌లో కొనసాగుతున్న దుకాణాల నిర్వాహణ, దుకాణదారులు అద్దెలు చెల్లిస్తున్న విధానం, తీసుకున్న అనుమతులు దేనికి, నడిపిస్తున్న వ్యాపారాలు ఏమిటి, అనధికార ఆక్రమణలకు పాల్పడి దుకాణాలు విస్తరించడం, కొబ్బరికాయలు, వాటర్ బాటిళ్ళు సహా ఇతర వస్తువులు తినుబండారాలు అధిక ధరలకు విక్రయించడం, ఇంత ఎక్కువ ధర ఏమిటి అని రోగుల బంధువులు ప్రశ్నిస్తే వారితో ఘర్షణ పడడం, చొల్లంగి వేణుగోపాల్ అనే వ్యాపారి దుకాణం రేకులతో నిర్మించడం, ఈ నిర్లక్ష్యం కారణంగానే కొద్ది రోజుల క్రితం అదే దుకాణంలో విద్యుతాఘాతం చోటుచేసుకోవడం వంటి కీలక అంశాలతో ఆ బృందం నివేదికను సిద్ధం చేసి శుక్రవారం కలెక్టర్‌కు సమర్పించింది. ఆయా అంశాలను పరిశీలించి నిర్ఘాంతపోయిన కలెక్టర్ తక్షణమే జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని పిలిపించి నివేదికలోని అంశాలపై ఆరా తీశారు. ఆ వివరాలన్నీ నిజమేనని డాక్టర్ కుమారి నిర్ధారించారు. ఆసుపత్రిలోని వ్యాపారులు విద్యుత్ బిల్లులు, అద్దెలు చెల్లించకపోవడంతో హెచ్‌డీఎస్ నిధులు మొత్తం అడుగంటాయని, ఆస్పత్రి అభివృద్ధికి వ్యాపారులు నిర్వాకం తీవ్ర ఆటంకంగా మారిందని వివరించారు. కేవలం అద్దెలే సుమారు 26 లక్షలు బకాయిలు ఉన్నాయని, ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో కలెక్టర్ వ్యాపారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అద్దెలు, విద్యుత్ బిల్లులు చెల్లించని, అలాగే టెలిఫోన్ బూత్ నిర్వహిస్తామని తక్కువ మొత్తానికే అనుమతులు పొంది సూపర్ మార్కెట్ వంటి దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యాపారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించనున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కోసం శుక్రవారం సాయంత్రం ఆర్ఎంఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించామని ఆమె తెలిపారు.

ఇంటి ముంగిటకే రేషన్

- ఎండీయూ వాహనాలతో తొలగిన సమస్యలు
- తూకంలో మోసాలకు, ప్రయాసలకు చెక్



లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న ఆపరేటర్

సామర్లకోట: పేదలకు రేషన్ సరకులు ఇళ్ల వద్దకే వచ్చి ఇవ్వడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ, మండల పరిధిలో 75 రేషన్ షాపులు ఉన్నాయి. గతంలో ఆయా షాపుల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవలసి వచ్చేది. నేడు ప్రజల ఇంటి వద్దకే ఎండీయూ వాహనం ద్వారా సరకులు అందజేస్తున్నారు. రేషన్ దుకాణానికి వెళ్లే సమయంలో డీలర్ లేకపోతే తిరిగిరావలసి వచ్చేది. స్థానిక 23వ వార్డు సత్యనారాయణపురానికి చెందిన తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులు సరకులు తెచ్చుకోవాలంటే మద్యం దుకాణాన్ని దాటి వెళ్లాల్సి వచ్చేది. దీంతో మహిళలు, యువతులు ఇబ్బంది పడేవారు. రేషన్‌షాపును తమ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని ఆందోళన చేసినా ఫలితం లేకపోయింది.

ఇబ్బందులు ఎదురుకాకుండా..

జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇంటి వద్దకే సరకులు పంపిణీ చేసేందుకు మండలంలో 28 ఎండీయూ వాహనాలను మంజూరు చేసింది. వాహనంలోనే ఎలక్ట్రానిక్ కాటాతో సరకులను తూచి ఇస్తారు. వేలి ముద్రలు పడని వినియోగదారుల కోసం వలంటీర్ల వేలి ముద్రలు వేసి సరకులు అందజేస్తారు. నాణ్యమైన బియ్యం అందుతున్నాయని వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఆ వాహనాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది.

పదో తేదీ లోపునే సరకులు



ప్రతి నెలా పదో తేదీ లోపునే రేషన్ అందుతోంది. గతంలో రేషన్ షాపునకు వెళ్లలేక కొన్ని నెలల పాటు రేషన్ తీసుకునే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంట్లో ఎవరు ఉన్నా సరకులు తీసుకునే అవకాశం ఉంది.

– కొంటేపూడి పుష్పమ్మ, ఇందిరా కాలనీ

తూకంలో మోసాలకు అవకాశం లేదు



ఎండీయు వాహనంలో రేషన్ సరకులు ఎలక్ట్రానిక్ కాటా ద్వారా ఇంటి వద్దనే తూకం వేస్తున్నారు. వార్డులోకి సైరన్ వేసుకొంటూ వాహనం వస్తుంది. దాంతో సరకులు తీసుకోడానికి సిద్ధమవుతున్నాం. దీనికి తోడు నాణ్యమైన సన్న బియ్యం అందుతున్నాయి.

– సింగవరపు కుమారి, బలుసులపేట